క్లుప్తంగా

నియామకం



స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్‌గా మండలంలోని తాటికొండకు చెందిన తౌటిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డిని నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలిగా సుమ



దేవరుప్పుల: ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షురాలుగా మండలంలోని రామరాజుపల్లికి చెందిన దాసగాని ఉమ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల ఏర్పాటు, విద్యా రంగ పరమైన సమస్యల్లో పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సత్వరమే చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఉద్యమ కార్యాచరణలో తనవంతు పాత్ర క్రియాశీలకంగా పోషిస్తానని అన్నారు. జిల్లా కమిటీలో తనకు చోటు కల్పించిన రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తల సూచనలతోనే కమిటీలు వేయాలి



చిల్పూరు: పార్టీ కోసం అహర్నిషలు పాటుపడుతున్న కార్యకర్తల సూచనలతోనే గ్రామ కమిటీలను వేయాలే తప్ప ఒకరిద్దరు వేసిన కమిటీలు చెల్లవని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సాదం గట్టయ్య అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో బుధవారం గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు అండగా గ్రామ శాఖ అధ్యక్షుడు ఊరడి యాదగిరి ఉన్నాడని, అతనిని కాదని ఒకరిద్దరు కమిటీని ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఇక నుంచి పాతకమిటీనే కొనసాగుతుందని తెలిపారు. కోతి మురళి, నరహరి, దయాకర్, సాదం రాజు, రాజయ్య, వెంకటయ్య, ఆశీర్వాదం, అమృతం, యాదగిరి, బుస్స వివ, దామెర రాజు వడ్ల కొండ రాజు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ పట్టా పొందిన సృజిత



జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన గబ్బెట శివయ్య–కుసుమ కుమారి దంపతుల కుమార్తె సృజిత ఎంబీబీఎస్ పట్టా అందుకుంది. మహబుబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ హెల్త్ యూనివర్సిటీలోని సృజిత ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఎంబీబీఎస్‌లో ప్రతిభను కనబర్చి పట్టా పొందడంతో పాటు గోల్డ్‌మెడల్‌ను కూడా సాధించింది. ఈ మేరకు అక్కడి కలెక్టర్ చేతుల మీదుగా పట్టాతో పాటు గోల్డ్‌మెడల్‌ను అందుకుంది. కాగా, సృజిత ఎంబీబీఎస్‌లో పట్టా పొందడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీఓఈ సీటు సాధించిన శ్రుతి



కొడకండ్ల: మండలకేంద్రంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతికి చెందిన సిలువేరు శ్రుతి టీఎస్‌డబ్ల్యూఆర్ సీఓఈ సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ తెలిపారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు దఫాల పరీక్షల్లో శ్రుతి పాల్గొని అర్హత సాధించి హైదరాబాద్‌లోని మహేంద్ర హిల్స్‌లోని సీఓఈ కళాశాలలో సీటు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రుతిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రతి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ కార్యక్రమంలో భాగంగా సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే చిన్నారులకు అందించే ఆహార పదార్థాలను, గుడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై ప్రచారం చేయాలి



దేవరుప్పుల: వడదెబ్బ నివారణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు



జఫర్‌గఢ్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు తదితరులు

దేవరుప్పుల: ఎండల తీవ్రతతో వచ్చే వడదెబ్బ నివారణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వడదెబ్బ నివారణపై అప్రమత్త చర్యలపై వాల్ పోస్టర్ ఆవిష్కరించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రాజపురి రవితేజ మాట్లాడుతూ ఎండల తీవ్రతతో డీహైడ్రేషన్ లక్షణాలు రావడంతో అనేక రుగ్మతలు వెలికి వస్తాయన్నారు. వడదెబ్బకు గురవ్వకుండా ఓఆర్ఎస్ వంటి పౌడర్‌ను తీసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఎంపీఓ సురేష్‌కుమార్, ఈజీఎస్ కమ్మగాని శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, పీహెచ్‌సీ సీహెచ్ఓ వెంకటస్వామి, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

జఫర్‌గఢ్: వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి కె.విష్ణు అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక అరోగ్య కేంద్రంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన వడదెబ్బ నివారణ వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఆరోగ్య సుత్రాలు పాటించాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఎవరు బయటకు వెళ్లకూడదన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, మహిళలు ఇంటి వద్దే ఉండాలన్నారు. నీరు సరిపడా తాగలన్నారు. ఆరోగ్య కేంద్రాలతో పాటు జీపీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎవరైన వడదెబ్బకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్సై రవియాదవ్, ఎంపీడీఓ సుమన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది కలిగించొద్దు



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని మండల స్పెషలాఫీసర్, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో పలు శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం తాగునీటి సరఫరాతోపాటు జీపీ పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి పైపులు లీకేజీ లేకుండా చూడాలని తెలిపారు. తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి, మండల నోడల్ అధికారి మూర్తి, ఎంస్ అధ్యక్షురాలు వినోద, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



బచ్చన్నపేట: ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు



తరిగొప్పుల: ఆర్థిక సాయం అందజేస్తున్న అభిగౌడ్

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన లింగాల నరేష్‌రెడ్డి మంగళవారం మృతి చెందాడు. కాగా, మృతుడితో కలిసి చదువుకున్న పదోతరగతి పూర్వవిద్యార్థులు మిత్రుడి కుటుంబాన్ని బుధవారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కోడూరి శివ కుమార్‌గౌడ్ రూ. 5వేల సాయం అందించారు. కిష్టారెడ్డి, బుచ్చిరెడ్డి, శ్యాం సుందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, క్రాంతి కుమార్, రాజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన కల్లుగీత కార్మికుడు తాళ్లపల్లి బక్కయ్య ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచిపడి మృతి చెందాడు. కాగా, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబసభ్యులను ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్ బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సంపత్, కనుకయ్య, సంపత్‌నాయక్, శ్రావణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అక్కరాజుపల్లిలో..

మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన మంచినీళ్ల యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబసభ్యులను రెయిన్‌బో యూత్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. అంకం రాజు, రవీందర్, రాజు, హరిప్రసాద్ ఉన్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలి



రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న పేర్ని రవి, ఉష తదితరులు



దేవరుప్పుల: కడవెండిలో నివాళులర్పిస్తున్న ఐలయ్య, ఝాన్సీరెడ్డి



బచ్చన్నపేటలో..

రఘునాథపల్లి: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, నిజాం నిరంకుశ పాలన విముక్తిలో అసమాన పోరాటం చేసిన దొడ్డి కొమురయ్య స్ఫూర్తిగా యువత ముందుకు సాగాలని జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు పేర్ని రవి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని కురుమ సంఘం భవన్ వద్ద రాష్ట్ర కురుమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి, స్థానిక ఎంపీటీసీ పేర్ని ఉష ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురుమ సంఘం నాయకులు గుండా వెంకటయ్య, ద్యావర యాకయ్య, పేర్ని నర్సింహులు, బడితె శ్రీనివాస్, బాలబోయిన శ్రీనివాస్, కొలుపుల నాగరాజు, దేవర రంజిత్, బడితె బీరయ్య, మాయ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

దేవరుప్పుల: మండలంలోని కడవెండిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన స్మారక విగ్రహానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, సీనియర్ నాయకులు కొడగాని సోమనర్సోజీ, మాసంపెల్లి మహేందర్‌జీ, పార్టీ గ్రామ అధ్యక్షుడు చెన్నూరు రాంబాబు, భాషిపాక ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో..

బచ్చన్నపేట: దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డిపల్లి గ్రామంలో కొమురయ్య విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పోచన్నపేటలో కూడా వేడుకలు చేపట్టారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగపోరాటయోధుడు దొడ్డి కొంరయ్య జయంతిని కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కురుమ సంఘం మండల అధ్యక్షుడు చంద్రమౌళి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేవేల్లి సంపత్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, జిల్లా నాయకులు విజయ్‌భాస్కర్, శేఖర్, మల్లేశం, వీరస్వామి, కర్రె కృష్ణ, కేమిడి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



నర్మెట: బొమ్మకూర్‌లోని పురాతన ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి పనులు కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కాగా, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ అభివృద్ధి పనులకు బుధవారం రూ. 10,516 కమిటీకి విరాళం అందజేశారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ బానోత్ శంకర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు పండుగ మల్లేష్, ఇట్టబోయిన రమేష్, పగడాల భరత్, మన్నె రవి, దీక్షా స్వాములు ఇట్టబోయిన సురేష్, మహేష్, కిష్టయ్య, చంద్రమౌళి, రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

భువనగిరికి తరలిన నాయకులు

బచ్చన్నపేట: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి మండలం నుంచి బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బుధవారం భువనగిరికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, ఎంపీటీసీలు దూడల కనుకయ్య, వేణుగోపాల్, నాయకులు ఇర్రి రమణారెడ్డి, కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



మాట్లాడుతున్న సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో పదేళ్లుగా ప్రతిపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీని తమ భుజస్కందాలపై మోసిన కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మట్లాడారు. కొద్ది రోజులుగా నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నామినేటెడ్, పార్టీ పదవుల గురించి టీపీసీసీ, ఏఐసీసీ సభ్యులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని చెప్పారు. రానున్న రోజుల్లో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టినా.. ఇబ్బందులకు గురిచేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను త్వరలో అధిష్ఠానం తెలియచేస్తుందని పేర్కొన్నారు. రఘునాథపల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మి, నాయకులు లింగాల జగదీష్‌రెడ్డి, నరేందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, కోరుకొప్పుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ ఉమాదేవి



నర్మెట: గండిరామారంలో..



తరిగొప్పులలో..



జఫర్‌గఢ్: రఘునాథపల్లిలో..



చిల్పూరులో..

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. మండలంలోని తాటికొండ, కొత్తపల్లి, శివునిపల్లి, పాంనూర్, తానేదార్‌పల్లి, అక్కపెల్లిగూడెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ఐకేపీ ఏపీఎం కుమారస్వామి, ఈజీఎస్ ఏపీఓ ప్రేమయ్య, సీసీలు రజని, ఉమా, యాదగిరి, యాకయ్య, ఏఈఓలు ఈశ్వరి, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని సముద్రాల, ఇప్పగూడెం, రంగరాయగూడెం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ముఖ్య అతిథిగా హాజరైన పీఏసీఎస్ సీఈఓ మగ్దుంఅలీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిచి మాట్లాడారు.

దళారులను ఆశ్రయించొద్దు

నర్మెట: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారును ఆశ్రయించి నష్టపోవద్దని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఏపీఎం మాదారపు రవి, పీఏసీఎస్ సీఈఓ కొన్నె వెంకటయ్య అన్నారు. మండలంలోని బొమ్మకూర్, గండిరామారం లలో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో, కన్నెబోయినగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను వారు బుధవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిబాబు, ఏఈఓలు జగదీష్, భవాని, కార్యదర్శులు అనిత, సుజాత, జై సంతోషీమాతా, బీఆర్ అంబేడ్కర్ గ్రామైఖ్య సంఘాల కార్యవర్గ సభ్యులు రేణుక, సువార్త, సుశీల, పద్మ, వీఓఏ రోజా, ప్రేమలత, పుష్పలత, మమత, రేణుక, సీసీలు కవిత, యాదగిరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

జఫర్‌గఢ్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని రఘునాథపల్లి, ఉప్పుగల్లు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడారు. దళారులను ఆశ్రయించకుండా రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఏపీఎం సురేందర్, సీసీ మేర్గు నర్సింగంతో పాటు ఐకేపి సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్, పల్లగుట్ట, కృష్ణాజీగూడెం గ్రామల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈఓ ముగ్దుం అలీ ప్రారంభించారు. సిబ్బంది రాజు, రాంప్రసాద్, ఏఈఓలు గుగులోత్ వినయ్, ప్రవళిక, యాకూబ్, నరసింహులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ వెంకటయ్య అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఏఈఓ జయశ్రీ, ప్రజ్ఞాపురం మల్లయ్య, పండుగ కనుకయ్య, కల్వ రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: రాష్ట్ర ప్రభుత్వం పండించిన వరి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న తరుణంలో చిల్లర కాంటాలను ఆశ్రయించవద్దని ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని దేవునిగుట్ట, సీతారాంపురం, కామారెడ్డి గూడెంలో సెర్ప్, ఐకేపీ ఆధ్వర్యంలో గ్రామైఖ్య సంఘాలు ఏర్పాటు చేసిన ధాన్యం కోనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, సీసీలు సోమనారాయణ, రామచంద్రం, వసంత, ఉమాదేవి, ఏఈఓ అరుణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుర్రం యేసుబాబు తండ్రి చంద్రయ్య(70) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. కాగా, బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి వేర్వేరుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. డాక్టర్ లక్కాకుల జగన్, సింగపురం జగన్, గుర్రం శంకర్, కుమార్, చిట్టిబాబు, గుర్రం శ్రీను తదితరులు ఉన్నారు.

'కలెక్టర్‌ను ఎన్నికల విధుల నుంచి తొలగించాలి'

జనగామ రూరల్: సీపీఎం నాయకులపై, ప్రజా సమస్యలపై పక్షపాత ధోరణి అవలంభిస్తున్న కలెక్టర్‌ను ఎన్నికల విధుల నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, గోపి, ప్రకాష్, విజేందర్, లింగం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'కలెక్టర్ అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

చిల్పూరు: సీపీఎం నాయకులపై కలెక్టర్ రిజ్వాన్ బాషా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రభుత్వం వెంటనే ఆయనపై చర్య తీసుకోవాలని ఆ పార్టీ మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం సాదం శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపత్, గద్ద కుమార్, రవి, పరమేష్, భిక్షపతితోపాటు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పాలకుర్తి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి తండ్రి పిచ్చయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, మల్లంపల్లిలో నిర్వహించిన దశదిన కర్మలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని పిచ్చయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ జలగం కుమారస్వామి, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పులి గణేష్, మాజీ ఎంపీపీ కారుపోతుల కుమారస్వామి, గద్దం యాకస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

చిల్పూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. మండలానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు బుధవారం పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్, పార్టీ మండల అధ్యక్షుడు గద్దమీది సురేష్ ఆధ్వర్యంలో ఇందిరను కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

యువకుడిపై అత్యాచారం కేసు నమోదు

లింగాలఘణపురం: మండలంలోని బండ్లగూడెం గ్రామానికి చెందిన అన్‌రెడ్డి యాకుబ్‌రెడ్డిపై అత్యాచారం, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. బండ్లగూడెం గ్రామానికి చెందిన ఓ దళిత యువతిని యాకుబ్‌రెడ్డి కొన్నేళ్లుగా ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసి మరో యువతిని ఇటీవలే వివాహం చేసుకోవడంతో ఆ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మద్యం విక్రయించిన వ్యక్తిపై..

దేవరుప్పుల: మండలంలోని దేవునిగుట్టతండాలో ధరావత్ రామ్‌సింగ్(హనుమాన్) చట్టవిరుద్ధంగా రూ. 5 వేల విలువైన మద్యం బాటిళ్లు నిల్వ చేసి బుధవారం విక్రయిస్తుండగా పట్టుకున్నట్టు ఎస్సై ఎన్. చెన్నకేశవులు తెలిపారు. సదరు వ్యక్తి వద్ద లభించిన మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం గ్రామంలో జీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ రఘురామకృష్ణ బుధవారం ప్రారంభించారు. అలాగే గ్రామంలోని వన నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని కూడా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నర్సరీల్లో వంద శాతం మొక్కలను రక్షించేందుకు ఉదయం, సాయంత్రం నీటిని పట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ పల్లపు రామకృష్ణ, నాయకులు ఇజ్జగిరి శేఖర్, నర్సింహులు, ఎర్రోజు శ్రీనివాస్, శ్రీరాములు, విజయ్, మానెపల్లి బాలరాజు పాల్గొన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించినట్లు ప్రత్యేక అధికారి రవీందర్, ఎంపీడీఓ శేషాద్రిసూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంట శ్రీనివాస్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



రఘునాథపల్లి: మండలంలోని మండలగూడెంలో బీజేపీ బూత్ అధ్యక్షుడు పొన్నాల ఆంజనేయులు, పరికె శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, జిల్లా అధికార ప్రతినిధి మంద వెంకటేశంయాదవ్, గాదె ఉపేందర్, బోల్ల రాజ్‌కుమార్, బోల్ల అఖిల్, అనిల్ రజనీకాంత్, నవీన్, రవి పాల్గొన్నారు.